

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 144 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 21, ఏప్రిల్ 2025 | పేజీలు 4 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగుళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# కక్ష'దారులకు..' కాపలాదారులు



ప్రజాసేవను మరిచి కక్షలు పెంచుతున్నారు

నమ్మించి నట్టేట ముంచడం రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య

రాజకీయ నాయకులు కక్ష దారులైతే అధికారులు కుట్ర దారులు అవుతున్నారు

హెచ్‌సియూ భూముల రాజకీయం ముమ్మాటికి కక్ష దారుల కుట్రే

రాజకీయ అధికారాన్ని వ్యక్తిగత స్వార్థాలకు వాడుకుంటున్నారు

రాజకీయంలో నిజాయితీని ప్రదర్శించాలంటే గుండె ధైర్యం గొప్పదై ఉండాలి

ఊసరవెల్లి రంగుల మాటలు మార్చే రాజకీయ నాయకులు 90శాతం పేరుకుపోయారు

ప్రజాభివృద్ధిని అడ్డుకుంటే పుట్టగతులు ఉండవు

ప్రజల కోసం కష్టపడే ప్రభుత్వాలు స్థిరంగా నిలబడతాయి

ప్రజాక్షేత్రంలో అందరం సమానమే రాజకీయం అధికారం అంటూ ఏమీ ఉండదు

గెలిపించిన ప్రజల్ని గేలి చేయకండి : డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

రాజకీయం నిస్వార్థాన్ని బలపరిచేదిపోయి స్వార్థాన్ని బలపరుస్తూ ప్రజల జీవితాలతో చెలగాటలాడుతుందని డాక్టర్ బరిగెల శివ క్షేత్రస్థాయిలో విమర్శించారు. భారతదేశ వ్యాప్తంగా పేద ప్రజల జీవితాలను బాగుపరచడం కోసం కొనసాగించబడుతున్న ప్రభుత్వాలు కరువైపోతున్నాయని మండిపడ్డారు.చాలా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కక్షలను పెంచి పోషిస్తూ రాజకీయ నాయకులు కక్షగట్టిన వ్యక్తులపై పగ తీర్చుకొనుట కొరకు పోలీస్ అధికారులను ఇతర ప్రభుత్వ శాఖ అధికారులను కాపలదారులుగా వాడుకుంటున్నారన్నారు. ఒకవైపు దేశాన్ని దోచుకుంటూ ప్రభుత్వ వ్యవస్థలను నిర్మూలం చేస్తుంటే అన్ని రాష్ట్రాల పరిధిలోని రాజకీయ నాయకులు కేంద్ర ప్రభుత్వ నాయకులను పొగడ్తలతో ముంచేత్తుతున్నారన్నారు. రాజకీయంలో నిలదొక్కుకొని నిలబడాలంటే కక్ష సాధింపు చర్యలను వదిలిపెట్టి నిజాయితీగా నిలబడాలని సూచించారు.పద్ధతి తప్పుతున్న ప్రభుత్వాలకు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. ఐఏఎస్ అధికారులు,ఐపీఎస్ అధికారులు రాజకీయాలకు, ప్రతిపక్షాలకు,తొత్తులుగా మారి సోషల్ మీడియాలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు వ్యతిరేకంగా పావులు కలుపుతుండడం తీవ్రంగా వ్యతిరేకించారు.ఒకవైపు దేశం మొత్తంలో రాజకీయ ఎన్నికల నియమావళి అధికార పార్టీలకు దాసోహం అయిపోయినట్టుగా ప్రపంచ దేశాలు నమ్ముతూ ఉంటే భారతదేశంలో మాత్రం అధికారం సంపాదించుకోవడం కోసం ఎంతటి దిగజారుడు రాజకీయాలకైనా

- మిగతా 2లో..




## జపాన్ లో మరో రెండు కంపెనీలతో
# రేవంత్ రెడ్డి బృందం ఎంవోయూ

జపాన్‌లో పర్యటిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బృందం

రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా పర్యటన

టెర్న్, రాజ్ గ్రూప్ అనే రెండు ప్రముఖ సంస్థలతో వేర్వేరుగా అవగాహన ఒప్పందాలు

తెలంగాణకు పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం జపాన్‌లో పర్యటిస్తోంది. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా సాగుతున్న ఈ పర్యటనలో భాగంగా బృందం ఇప్పటికే పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది, ప్రముఖ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపింది. తెలంగాణ యువతకు విదేశాల్లో, ముఖ్యంగా జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. జపాన్‌కు చెందిన టెర్న్, రాజ్ గ్రూప్ అనే రెండు ప్రముఖ సంస్థలతో వేర్వేరుగా అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా ఆరోగ్య సంరక్షణ రంగంలో 200, ఇంజినీరింగ్ రంగంలో 100, పర్యాటక రంగంలో 100, నిర్మాణ రంగంలో 100 చొప్పున మొత్తం 500 ఉద్యోగావకాశాలు లభించనున్నాయని అధికారులు తెలిపారు. తెలంగాణ బృందం తమ పర్యటనలో భాగంగా కితాక్యూషూ నగరాన్ని సందర్శించింది. అక్కడ నగర మేయర్ కజుహిసా టకేచీతో సమావేశమైంది. ఒకప్పుడు తీవ్ర కాలుష్యంతో సమస్యలను ఎదుర్కొని, నేడు పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన కితాక్యూషూ నగరం సాధించిన ప్రగతిని, అమలు చేసిన ప్రణాళికలను బృందం అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా మురసాకి రివర్ మ్యూజియం, ఎన్విరాన్‌మెంట్ మ్యూజియం, ఎకో టౌన్ సెంటర్‌లను కూడా సందర్శించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ బృందం మరో రెండు రోజుల పాటు జపాన్‌లో ఉండనుంది. మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం లక్ష్యంగా మరిన్ని సమావేశాలు, చర్చలు జరపనున్నారు.



# మాదిగలకు మేలు జరగాలి

ఎస్సీ రిజర్వేషన్ల హక్కులకు పూర్తి న్యాయం జరగాలి

కొలనుపాక ఆదిజాంబవ మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తాళ్ల అజయ్



**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

ఎస్సీ వర్గీకరణ రెండు తెలుగు రాష్ట్రాల్లో అమలు జరగడం వల్ల మాదిగల భవిష్యత్తులో అంతా మంచి జరగాలని సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్టిఎస్ఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు తాళ్ల అజయ్ కొలనుపాక ఆది జాంబవ మఠాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదిగలు సామాజిక,ఆర్థిక, రాజకీయ, వ్యాపార రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు నడవాలని మాదిగల త్యాగ గుణంతో, సమాజంపై ప్రేమతో అనేక అవకాశాలను వదులుకున్నారని సమాజం అక్కున చేర్చుకోవాలని కోరారు,ప్రభుత్వాలు వివక్షత పాటించకుండా అవకాశాల్లో ప్రాతినిధ్యం కల్పించి ప్రోత్సహించాలని కోరారు.ఎస్సీ కులాలు సోదరభావంతో మెలుగుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యులు అవ్వాలని తెలిపారు.న్యాయమైన ఎస్సీ వర్గీకరణ కు సహకరించిన సుప్రీంకోర్టు,కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలకు, ఉద్యమ నాయకులకు, సహకరిం చిన సమాజానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓ.యూ విద్యార్థి నాయకులు పరుశురాం,సుధాకర్ పాల్గొన్నారు.

# కర్ణాటక మాజీ డీజీపీ అనుమా నాస్పద మృతి



బెంగళూరులోని నివాసంలో విగతజీవుడిగా ఓం ప్రకాశ్

హత్య అని భావిస్తున్న పోలీసులు

ఓ కుటుంబ సభ్యుడి ప్రమేయం ఉండొచ్చని అనుమానం

కర్ణాటక రాష్ట్ర మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ (68) అనుమానాస్పద స్థితిలో మరణించారు. బెంగళూరులోని ఆయన నివాసంలో నేడు విగతజీవుడిగా కనిపించారు. హత్య అని అనుమానాలు వ్యక్తమవుతుండటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని గమనించిన అధికారులు, ఇది సహజ మరణం కాకపోవచ్చని, హత్య జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ఓ కుటుంబ సభ్యుడి ప్రమేయం ఉండవచ్చనే కోణంలోనూ విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. 1981 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఓం ప్రకాశ్, బీహార్‌లోని చంపారన్ ప్రాంతానికి చెందినవారు. ఎమ్మెస్సీ (జియాలజీ) విద్యార్హత కలిగిన ఆయన, 2015 మార్చి 1న కర్ణాటక డీజీపీగా బాధ్యతలు స్వీకరించి, సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం, ఓం ప్రకాశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మృతికి గల కచ్చితమైన కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ అనుమానాస్పద మృతి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

## టీం శివంగి'.. రాష్ట్రంలో తొలిసారి రంగంలోకి మహిళా కమాండోల బృందం

**నిర్మల్ మామడ అడవిలో చిక్కుకున్న మహిళలను కాపాడేందుకు టీం శివంగి వెళ్లింది**

**ఆడవాళ్లు కూడా తక్కువ కాదని నలుగురు మహిళలు కారడవిలోకి వెళ్లారు. అయితే రాష్ట్రంలో మొదటిసారిగా ఎస్పీ జానకి షర్మిల అధ్వర్యంలో టీం శివంగి అనే మహిళా కమాండోల బృందాన్ని ప్రారంభించారు**



**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

తునికాకు సేకరణకు వెళ్లిన నలుగురు మహిళలు నిర్మల్ దగ్గర ఉన్న మామడ అడవిలో చిక్కుకున్నారు. చీకటిలో దారి తప్పిపోయి ఇంకా దట్టమైన అడవిలోకి వెళ్లిపోయారు. దీంతో వీరిని కాపాడేందుకు మహిళా పోలీసు బృందం వెళ్లింది. మహిళా కానిస్టేబుళ్లను ఎంపిక చేసి.. ఆ నలుగురు మహిళలు ఏమాత్రం బెదరకుండా కారడవిలోకి వెళ్లారు. అయితే దీనికి ముఖ్య కారణం.. నిర్మల్ ఎస్పీ జానకి షర్మిలనే. ఎందులోనూ ఆడవాళ్లు తక్కువ కాదని ఆమె నిరూపించడానికి మొదటిసారిగా టీం శివంగి అనే మహిళా కమాండోల బృందాన్ని ప్రారంభించారు. ఇందులోని సభ్యులను పురుష కమాండోల విధంగానే తీర్చారు. దీనికోసం మహిళా కానిస్టేబుళ్లను ఎంపిక చేసి వారికి 45 రోజుల పాటు కఠిన శిక్షణ అందించారు. వీరికి వ్యాయామాలు చేయించడం, పోరాట నైపుణ్యాల్లో మెలకువలు కూడా నేర్పించారు. అలాగే పేలుడు పదార్థాల వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. అడవుల్లో మ్యాప్ రీడింగ్, ఆకస్మిక వ్యూహాలు అవలంభించడం, శత్రువుల కదలికలను గుర్తించడం, ఎదురు దాడులకు దిగడం వంటి అంశాల్లో వారికి శిక్షణ ఇచ్చారు. అయితే ఈ బృందాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క కలెక్టరేట్‌లో ప్రారంభించారు.

## మహాదేవపుర దళిత సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరు మహ నగరం లోని మహాదేవపుర నియోజకవర్గంలో మహాదేవపుర దళిత సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు జరిగాయి రాజ్యాంగాన్ని వ్యతిరేకించే ముందు రాజ్యాంగాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలని మహదేవపుర దళిత సంఘం ప్రధాన కార్యదర్శి, న్యాయవాది వి.విక్రమ్ అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు మహదేవపుర దళిత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగంలోని అంశాలు ఇంకా అమలు కాలేదని, హెూదాలు రావాల్సిన వారికి రాలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అన్ని ప్రభుత్వాలు రాజ్యాంగంలోని అంశాలను ప్రజలకు చేరవేయడంలో విఫలమయ్యాయి. ప్రతి మతం ప్రకారం గ్రంధాలు ఉన్నాయి, కానీ భారతదేశానికి ఒకే ఒక గ్రంథం ఉంది, అది రాజ్యాంగం. కొందరు మూరు?లు తమకు తెలియకుండానే వ్యతిరేకిస్తున్నారని, పూర్తిగా తెలిసిన వారికే దీని సారాంశం అర్థమవుతుందని అన్నారు. రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవడంలో ప్రజానీకం కూడా వెనుకబడి ఉన్నారని, ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని అర్థం చేసుకున్నప్పుడే సమాజంలో మంచిగా జీవించగలరని అన్నారు. మహదేవపూర్ నియోజకవర్గంలోని దళితులంతా కలిసి పార్టీలకతీతంగా అంబేద్కర్ జయంతిని జరుపుకోవడం హర్షించదగ్గ విషయమని, ఐక్యతతోనే అన్నీ సాధించవచ్చనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఆదివారం రోజు దాదాపు వెయ్యికి పైగా బైక్‌లపై అభిమానులు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు హూడీ హెచ్.వి. మంజునాథ్, సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, హూడి రామచంద్ర, నల్లూరహల్లి వినోద, దేవరాజ్ సూర్యవంశీ, ఎస్ కె వెంకటేష్, మంజు, మాదేష్, కడుగుడి సొన్నప్ప, రఘు, బెళతూరు వెంకటేశ్, కృష్ణమూర్తి (ఏజేఎస్), న్యాయవాదులు విజయన్, కన్నెలి సురేష్, ఆసిఫ్, సంజయ్, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలనా శాస్త్రంలో రిఫ్రెషర్ కోర్స్

**సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి**

**ప్రస్తుత పరిశోధకులకు మాత్రమే అవకాశం**

**విభాగధిపతి ఆచార్య పెదమళ్ళ శ్రీనివాస రావు**



**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:**

ఏప్రిల్ 21 నుండి ఏప్రిల్ 26 వరకు ప్రభుత్వ పాలనా శాస్త్రం, మానవ వనరుల నిర్వహణ శాస్త్రం లోని రన్నింగ్ రీసెర్చ్ స్కాలర్స్ కు మాత్రమే రీసెర్చ్ మెథడాలజీ మీద శిక్షణ తరగతులు వారం రోజులు నిర్వహించడం జరుగుతుందని విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ. శ్రీనివాస రావు తెలిపినారు. రీసెర్చ్ మెథడాలజీ అంశాల మీద విశేష పరిశోధన అనుభవం ఉన్న సీనియర్ ఆచార్యులు బోధించటం జరుగుతుందని డిపార్ట్మెంట్ స్కాలర్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరినారు. – హెడ్, డిపార్ట్మెంట్ అఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మానేజ్మెంట్, కాకతీయ యూనివర్సిటీ.

# కక్ష "దారులకు" కాపలాదారులు

మొదటి పేజీ తరువాయి

పాల్పడుతున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ప్రజాసేవ కోసం బలమైన సాధన పనిముట్టుగా ముందుకు సాగుతుండగా ఆంధ్రప్రదేశ్లో హత్య రాజకీయాలు ఎక్కువగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.చిల్లర రాజకీయాలను ప్రేరేపించడం వల్ల ఎవరికి మేలు జరుగుతుందో తెలియదు గానీ రాజకీయాలను వ్యాపారాలుగా... వ్యాపకాలుగా మలుచుకొని లెక్కకు మించిన పోలీస్ సెక్యూరిటీతో యదేచ్ఛగా తిరుగుతూ అభివృద్ధి పేరును వాడుకుంటున్నారన్నారు. ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్రతి అభివృద్ధి పనిని ప్రజాక్షేత్రంలో తెలుపుతుండడంతోపాటు ఆయాభివృద్ధి పనుల ఖర్చులను లెక్కలను టెండర్ల రూపంలో మంజూరు చేయబడిన ఆధారాలు అన్నిటిని ఆయా రాష్ట్రాల ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఏ సందర్భంలోనైనా అభివృద్ధి పనులను అడ్డుకోవడం పూర్తిగా కక్ష దారుల పనేనన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ఎన్నికల తలనంతరం ప్రదర్శిస్తున్న రాజకీయ హుందాతనాన్ని మిగతా రాష్ట్రాల ప్రతిపక్ష నాయకులు అలవర్చుకోవాలన్నారు. ప్రజలకు అన్యాయం జరుగుతున్నప్పుడు ప్రత్యక్షంగానో... పరోక్షంగానో రాజకీయ పరిణితిని ప్రదర్శిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నప్పటికిని అధికార బలం అనుకున్న పనులను....అనుకున్న కక్షలను నిర్వర్తించుకుంటూ ముందుకు సాగుతాయన్నారు. ఒకవైపు దేశాన్ని రక్షించుకోవాల్సిన యువత పిచ్చి కుక్కల కన్నా అద్వానంగా తయారై వ్యసనాల ముసుగులో దేశానికి మచ్చగా తయారవుతున్నారన్నారు. 10 సంవత్సరాల కాలంలో భారతదేశం ఇంతలా నాశనం అవ్వడానికి ప్రధాన కారణం నాయకులేనన్నారు. ఈడి,ఐటి పోలీసు వ్యవస్థలు ఎక్కువ శాతం ప్రభుత్వాల చేతిలో కీలుబొమ్మలుగా మారి అదుపు తప్పుతున్నాయన్నారు. రాత్రి కక్షగట్టడం ఉదయం కక్ష సాధింపు చర్యలు చేపట్టడం దేశవ్యాప్తంగా షరామాములై పోతున్నాయన్నారు. ప్రభుత్వాలు చేపడుతున్న దుర్మార్గపు పనులను ప్రశ్నించే వాళ్లపై చర్యలు తీసుకుంటామని కక్షులకు పాల్పడుతున్న ఆయా ప్రభుత్వ నాయకులు సిగ్గు శరం మానం చంపుకొని రాజకీయంలో కొనసాగుతున్నరన్నారు. న్యాయాన్ని అడుగుతున్న ప్రతిసారి ప్రతిపక్షాల ప్రోత్సాహంతో చిల్లర గొడవలు సృష్టిస్తున్నారని రాజకీయ నాయకులు బహిరంగంగా మాట్లాడుతుండడం రాజకీయ పాలన చేతకానితనమన్నారు. స్వార్థపరుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారుతున్న అధికార యంత్రాంగాల్లో మార్పులు సంభవించకపోయినట్లయితే సామాన్య ప్రజల దీన వ్యవస్థ ఇంకా దిగజారిపోతుందన్నారు. ప్రతిపక్షాల కుట్రలు చివరకు ప్రభుత్వ ఉన్నత అధికారులను కూడా ఉపయోగించుకునే స్థాయికి దిగజారాయన్నారు.

నిజాయితీని ప్రశ్నిస్తున్న వ్యక్తులు సంబోధించే అంశాలలో నిజాయితీ ఎంతుందో అబద్ధం ఎంత ఉందో ప్రభుత్వ పెద్దలతో పాటు అధికారులు కూడా గుర్తించాలన్నారు.అలాంటప్పుడే సమాజంలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వాలలోని ప్రధాన నాయకులే హత్యలు చేయిస్తూ యాక్సిడెంట్స్ అని చిత్రీకరిస్తుంటే పోలీస్ అధికారులు, రెవెన్యూ వైద్యులు, ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా మారాల్సిన పరిస్థితులు కనుల ముందే జరిగిపోతున్నాయన్నారు. తెలంగాణలో హెచ్సీయూ భూవివాదం దినదినానికి పతాక స్థాయి గొడవలకు దారితీస్తూ చిత్ర విచిత్రమైన రాజకీయాలను ప్రేరేపిస్తుందన్నారు. అంధకార శక్తులు అన్ని ఏకమై అక్కరకు రాణి రాజకీయాలకు పాల్పడే బదులు ఆధారాలు బయటపెట్టి మాట్లాడితే బాగుంటుందన్నారు. హెచ్ సియూ భూముల విషయంలో సుమోటో కేసును స్వీకరించిన సుప్రీంకోర్టు కాళేశ్వరం ప్రాజెక్ట్ ,మిషన్ భగీరథ, గత భీఆర్ఎస్ హయాంలో జరిగిన అధికార దుర్వినియోగం అవినీతి అక్రమాలపై కూడా సుమోటో కేసును స్వీకరించి చర్యలు చేపడితే తెలంగాణ ప్రజలకు కాస్తయినా మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రజలకు తలవంపులు తీసుకొచ్చే విధంగా ప్రతి మంత్రి గాలి మోటార్లలో తిరుగుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగ పరుస్తుండడం అసహ్యంగా ఉందన్నారు. ఎంతటి నాయకుడైనా సామాన్యుల వలె ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాల్సింది పోయి రాజకీయ పదవుల కార్యక్రమాలను నిర్వహించే క్రమంలో అవసరం లేని సందర్భాల్లో కూడా అత్యధిక ప్రజాధనాన్ని ఖర్చు చేయిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాభివృద్ధికి దగ్గరగా పనిచేస్తున్న ప్రభుత్వాలలో తెలంగాణ రాష్ట్రం కాస్తంత ముందు వరుసలో ఉంటుండగా మంత్రులు, నాయకులు, అధికారులు ఎవ్వలకు వాళ్లే ప్రజలను మోసగిస్తున్నారన్నారు. ఒకవైపు అభివృద్ధి మరోవైపు అధికార దుర్వినియోగం సమపాలుగా కొనసాగుతుండడాన్ని సామాన్య ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. దేశవ్యాప్తంగా మత కల్లోలలో పెరిగిపోతున్న కక్షలకు ప్రధాన కారకులు ఎవరంటూ ప్రశ్నించారు. భారతదేశ ముఖచిత్రాన్ని రక్తసిక్తంగా మారుస్తున్న మూరు?లను దేశం దాటి తరిమే వరకు వదిలిపెట్టొద్దని ప్రజలను కోరారు.

### భారత రాజ్యాంగం లేకపోతే దేశం ఎక్కడిది..

పోరాడినోడు పగస్తుడవుతున్నాడు నేరస్తులు దోస్తులవుతున్నారని ప్రస్తుత రాజకీయాల్లో ఎక్కడ చూసినా అవే ఆనవాళ్లు కనిపిస్తున్నాయన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశంలోని ప్రతి పౌరునికి ప్రధానమైన మూడు హక్కులను వాళ్ళ బుజస్కందాలపై ఉంచారన్నారు అందులో ఒకటి ఓటు హక్కు అయితే రెండవది, సమాన హక్కు భావ ప్రకటన స్వేచ్ఛ అన్నారు, మూడవదిగా సర్వ మతాలకు ప్రాధాన్యతను అనుభవించే హక్కును దేశ ప్రజలకు ఇచ్చారన్నారు. అందులో మొదటిది రాజకీయ నాయకుల ఎన్నికల స్వార్థంలో బలై పోతుండగా. రెండవది సమాన హక్కుల కోసం,న్యాయం కోసం ప్రశ్నిస్తున్న వ్యక్తులను కిరాతకంగా అణచివేస్తూ చంపిస్తూ ఆధారాలను, సాక్షాలను తారుమారు చేస్తూ ఇటు రాజ్యాంగాన్ని అటు ప్రజల్ని మోసగిస్తున్నారన్నారు. ఇక పోతే మూడవదిగా ప్రధానంగా చెప్పుకోవాల్సినది సర్వ మతాలకు సమాన ప్రాధాన్యత అనేది ఏదైతే ఉందో ప్రస్తుతం దేశంలో అన్ని రాష్ట్రాల్లో కొనసాగించబడుతున్న మత కల్లోల అల్లర్లు ఎంతటి దుర్మార్గతను ప్రదర్శిస్తున్నాయో ప్రత్యక్షంగా చూడగలమన్నారు. ఆయా ప్రభుత్వాలకు అనుగుణంగా ఉన్న వ్యక్తులు మతాల పేర్ల మీద ఎంతటి దుర్భాషలాడిన ఇతర మతాలకు సంబంధించిన వ్యక్తులను ఎన్ని చిత్రహింసలు పెట్టిన చివరకు హత్యలు చేసిన ప్రభుత్వాలు అలాంటి వ్యక్తులకు అండగా నిలుస్తున్నారు తప్ప కట్టడి చేయలేకపోతున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు కక్ష సాధింపు చర్యల్లో బాగాలైపోతున్నాయే తప్ప ప్రజలకు రక్షణ కల్పిద్దామనే సోయి దినదినానికి తగ్గిపోతుందన్నారు. అధికారం ఎవరికి శాశ్వతంకాదని అందరికీ తెలిసినప్పటికిని బంగారు సింహాసనంపై కూర్చోబెట్టిన పంది సింహాసనాన్ని వదిలేసి బురద కంపులో ధోర్లినట్టుగా అధికారంలో గద్దెనెక్కిన ప్రభుత్వాలు ప్రజాసేవను విడమర్చి అక్రమాలకు, అవినీతికి పాల్పడినట్లయితే పందిని అనుసరించిన వాళ్ళ అవతారన్న సంగతిని మర్చిపోవద్దన్నారు. భారత రాజ్యాంగం లేకపోతే భారత దేశ నిర్మాణం ఎలా సాధ్యమయ్యేదో దొంగ మాటలు మాట్లాడుతూ వెదవ వేషాలు వేస్తున్న ప్రతి నాయకుడు ఒళ్ళు దగ్గర పెట్టుకొని గమనిస్తూ గుర్తుపెట్టుకోవాలన్నారు. సామాన్య ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో భాగంగా విద్య, వైద్యం, ఉపాధి, ఎప్పటికప్పుడు అందించబడాలన్నారు అలాంటిది ప్రతి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో మునిగిపోయి పరిపాలనను గాలికి వదిలేస్తున్నారన్నారు. అలాంటి సందర్భంలో ప్రతి అభివృద్ధి పనిపై అడ్డంకులు సృష్టిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కుట్ర దారులపై ప్రజా సంక్షేమాన్ని బలపరచడం కోసం కొన్ని సందర్భాల్లో కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి గానీ మా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఒంటరి పోరాటం చేస్తూ కష్టబోతు తనాన్ని ప్రదర్శిస్తూ తన తల వెంట్రుకలకు మించిన నిందలు, అవమానాలు, ఎదురు దాడులు, కుట్రలు, కుతంత్రాలు, కక్షలను ఎదుర్కొంటూ దమ్మున్న నేతగా ధైర్య సాహసాలతో పరిపాలనను కొనసాగిస్తున్నారన్నారు. భారత రాజ్యాంగాన్ని ఎవరైతే అత్యధికంగా గౌరవిస్తారో వాళ్లే సామాన్య ప్రజల జీవన మనుగడను అభివృద్ధి చేయాలనే కృషి పట్టుదల సామర్థ్యపు నైపుణ్యత ఎక్కువగా కలిగి ఉంటారని భావించాల్సి ఉంటుందన్నారు.

# రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

**కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి**

**పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**వరంగల్ జై భీమ్ న్యూస్**

రైతు లేనిదే రాజ్యం లేదని రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం సంగెం మండల కేంద్రంలోని షాపూర్, సోమ్లా తండా గ్రామాల్లో ఎఫ్ ఎస్ సి ఎస్ కాపుల కనపర్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణితో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు గర్వంగా బ్రతికేలా కృషి చేస్తున్నదని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పండించిన పంటలు ప్రపంచ మార్కెట్ లో పోటీ పడి అమ్ముకొనేలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతులకు ఆధునిక వ్యవసాయంపై శిక్షణ ఇచ్చే బాధ్యతలు రైతు సహకార సంఘాలకు



ఇస్తున్నదని అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.ఏ గ్రేడ్‌కు రూ. 2320, కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17% మాయుచర్ ఉండాలి అని అన్నారు. నిబంధనల మేరకు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని, లారీలలో మిల్లులకు తరలించిన ధాన్యాన్ని అన్లోడ్ చేసే దగ్గర జాప్యం జరగకుండా చూడాలనీ సూచించారు. కేవలం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే సన్నధాన్యానికి బోనస్ లభిస్తుందన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలికసదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.రవాణ, హమాలీలు, గోనె సంచుల కొరత రాకుండా చూడాలని అన్నారు.

# ఈ రోజు ప్రజావాణి కార్యక్రమం రద్దు

**జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లా కలెక్టరేట్ లో ఈ రోజు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ దృష్ట్యా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. కావున జిల్లాకు చెందిన ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. వచ్చే సోమవారం యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రకటనలో వెల్లడించారు.



# అనధికార కటౌట్లు వేసినందుకు కాంగ్రెస్, బీజేపీ నేతలపై జరిమానా విధించాలని ఆప్ డిమాండ్

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరులోని గోవిందరాజనగర్, విజయనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎక్కడికక్కడ అక్రమంగా ఫ్లెక్స్ కటౌట్‌లు వేస్తున్నారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎం. కృష్ణప్ప, ఆయన కుమారులు ప్రియకృష్ణ, ప్రదీప్ కృష్ణ, బీజేపీకి చెందిన ఉమేష్ శెట్టి విచక్షణారహితంగా నియోజక వర్గంలో ఎక్కడికక్కడ ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జాం ఏర్పడింది. వేల కిలోల బరువున్న చెట్లను ఉపయోగించి అనేక ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కటౌట్‌లు అత్యంత ప్రమాదకరమైనవి. నిన్న నాగర్‌బావి సర్కిల్‌లో ఈ చెట్లు నేలకూలడంతో పలువురికి నష్టం వాటిల్లింది. ప్రధాన రహదారులపై వేసిన బ్యానర్లు సైతం వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ జగదీష్ వి. ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారిపై భారీ జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'బ్రాండ్ బెంగళూరు కాన్సెప్ట్‌ను తలపిస్తున్న బెంగళూరు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డీకే శివకుమార్‌కు ఈ విషయం తెలియదా.. బీబీఎంపీ అధికారులు సైతం మౌనప్రేక్షకులుగా కూర్చోవడం వ్యవస్థ తీరుకు అద్దం పడుతోంది. కొత్త ప్రకటనల విధానం ఇప్పటికే అమల్లోకి వచ్చిందని స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు తెలియదా.. తక్షణమే ఈ నేతల చేష్టలు తక్షణం మానుకుని భావితరాలకు తగు చర్యలు తీసుకోవాలి అని జగదీష్ వి.సదమ్ డిమాండ్ చేశారు.




# సమ్మెను గౌరవించండి సకాలంలో న్యాయంచేయండి





**అధికారుల మౌనం అణిచివేతకు దారితీస్తుంది**
**ప్రభుత్వ పెద్దలను ఒప్పించాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయ అధికారులదే**
**మాకు న్యాయం చేశాకే తదుపరి కార్యాచరణకు ముందుకు పోవాలి**
**అధికారులారా ఆదర్శంగా నిలవండి**
**కేయూలో రెండవ రోజు కాంట్రాక్ట్ ప్రొఫెసర్ల సమ్మె**


**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:**

కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు రెండవ రోజు తమ సమ్మెను కాకతీయ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదురుగా కొనసాగించడం జరిగింది. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ప్రొఫెసర్ జేఏసీ నేతలు డా. శ్రీధర్ కుమార్ లోద్, డా.సాదు రాజేష్, డా. మాదాసి కనకయ్య,డా. ఆరూరి సూర్యం తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వివిధ యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల కి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ఉందని, లేనట్లయితే రాష్ట్రంలో 12 యూనివర్సిటీలు సంక్షోభంలోకి వెళ్లబోతున్నాయని, అనేక సంవత్సరాల తరబడి విద్యా ప్రమాణాలను కాపాడుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను విస్మరించడం తగింది కాదని ఈ సందర్భంగా విమర్శించారు 1200 కు పైగా కుటుంబాలు ఆవేదనతో సమ్మెలోకి రావడం జరిగిందని ఆయా యూనివర్సిటీలో వి.సీలు బాధ్యతలు తీసుకొని ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా. బైరి నిరంజన్ డా.జూల సత్య,డా. సూర్యనారాయణ, డా. చంద్రశేఖర్, డా. రఘు వర్ధన్ రెడ్డి,డా.సునీత, డా. సంగీత్ కుమార్ డా. భాగ్య, డా. సుకన్య, డా. ఉషా కిరణ్, డా.శ్రీలత డా. సత్యనారాయణ, సిద్దార్థ్, రంజిత, మనీష్, రూమన అబ్దిల్ డా. భాగ్యలక్ష్మి, డా. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి

ఆయన ప్రజ్ఞ అసామాన్యం. కృషి అనితర సాధ్యం. తెలుగు రచయితగా, తెలుగు సినిమా ఆర్ట్ డైరక్టరుగా, సంపాదకుడుగా, చిత్రలేఖనోపాధ్యాయుడుగా ఏ పని చేసినా అంకిత భావంతో, చిత్తశుద్ధితో, లక్ష్యంతో చేసేవారు. పగటి వేషాలు వేసినా, చిత్రాలను గీసినా, గేయాలు రాసినా, సంపాద కత్వం వహించినా, ప్రసంగాలు చేసినా, విద్యార్థులకు శిక్షణలు ఇచ్చినా, వారిలో సృజనాత్మకత పెంపొందించే కృషి సల్పినా పనిలో లీనమై చేసేవారు. తాతా రమేశ్ బాబు(1960 జనవరి 15 - 2017 ఏప్రిల్ 20) గుంటూరు జిల్లా భట్టిప్రోలు గ్రామంలో 1960 జనవరి 15 వ తేదీన బసవలింగం, బోలెం లక్ష్మీనరసమ్మ దంపతులకు జన్మించారు. ఆయన బాల్యం అంతా కృష్ణా జిల్లా లోనే గడచింది. ఉయ్యూరు, కైకలూరు, మొవ్వ, అవనిగడ్డ లలో తొమ్మిదవ తరగతి వరకూ చదువు కున్నారు. పదవ తరగతి మచిలీపట్టణం జైహింద్ హైస్కూల్ లోనూ, ఇంటర్మీడియట్, డిగ్రీలను ఆంధ్ర జాతీయ కళాశాల లోనూ చదువుకున్నారు. డిగ్రీ ఆఖరి సంవత్సరంలో వుండగా మద్రాసు సినీ పరిశ్రమకు అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా వెళ్ళవలసి వచ్చింది. అందువల్ల డిగ్రీ పూర్తి చేయలేక పోయారు. ఆయనకు చిన్ననాటి నుండి లలిత కళలు అన్నా, ఆటలు అన్నా చాలా ఇష్టం. అయిదారు తరగతుల్లో ఉన్నప్పు డు ఆయన ఈ బాలగేయం రాశారు. ఆ సమయంలోనే "బాల జ్యోతి"లో ఆయన గేయాలు కొన్ని అచ్చయ్యాయి. ఆ వయసులోనే బొమ్మలంటే చాలా ఇష్టం కలిగింది. వేద్దామంటే ఇంట్లో కుంచెల్లాంటివి ఏమీ ఉండేవి కావు. ఓ కర్రతో బొమ్మలు గీసేవారు. అలా చిత్రకళపై పట్టు పెంచుకున్నా ఇప్పటి వరకూ ఆధునిక పద చిత్రాలు, సూక్ష్మచిత్రాలు, 'అభినందన సందేశాల చిత్రాలు... అన్నీ కలిపి లక్షల్లో గీశారు. ఆయన పదవ తరగతి నుంచే గేయాలు రాయటం, నాటకాలు వేయటం మొదలు పెట్టారు. ఆయన రచనలు చాలా దిన, వార పత్రికలలో ప్రచురించ బడేవి. ప్రచురింపబడిన ఆయన పుస్తకాలు, అణువు పగిలింది (కవిత్వం), పిడికిలి (దీర్ఘ కవిత), తాతా రమేశ్ బాబు కథలు, విప్లవ రుతువు (కవిత్వం), తొలిగీతలు, దిద్దు బాటు (బొమ్మలాట), తయారు చేద్దాం (క్రాఫ్ట్ వర్క్), అసలు నిజాం (బొమ్మలాట), నాన్నో పులి (బొమ్మలాట), బొమ్మలాట (బొమ్మలు తయారు చేసి ఆడించటం), శుభాకాంక్షలు (అభినందన పత్రాలు), లయ (ఆకాశవాణి సమీక్షలు), నా దేశం (దీర్ఘ కవిత), తాతా రమేశ్ బాబు చిత్రకళ, బాలబంధు బివి జీవిత చరిత్ర. 2005వ సంవత్సరంలో మచిలీ పట్టణం నుండి వెలువడిన 'జనప్రభ' సాహిత్యమాస పత్రికకు ఆయన సంపాదకుడిగా వ్యవహ రించారు. 2006వ సంవత్సరంలో జాతీయ తెలుగు రచయితల మహాసభలకు ముఖ్య కార్యకర్తగా సేవలను అందించటమే కాక, ఆంధ్ర ప్రదేశ్ అవతరణ స్వర్ణోత్సవాల నేపథ్యంలో యాభై ఏళ్ళ తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య వికాసాల సమీక్షగా వెలువడిన నూట పన్నెండు వ్యాసాల సంకల నం 'తెలుగు పసిడి' గ్రంథానికి ఉప సంపాదకునిగా ఉన్నారు. అలాగే 2007 సంవత్సరంలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో ముఖ్య కార్యకర్తగా సేవలను అందించారు. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల నేపథ్యంలో వివిధ రంగాలలో తెలుగువారి అరవై ఏళ్ళ ప్రగతి సమీక్షగా వెలువడిన 213 వ్యాసాల సంకలనం 'వజ్ర భారతి ' ఉద్గ్రంథానికి సంపాదక వర్గంలో ఉన్నారు. చిన్నప్పటి నుంచే ఆయనకు నాటకాలంటే ఇష్టం. నటన మీద ఇష్టంతో టీవీ ధారావాహికలు, చలనచిత్రాల్లో నటిస్తున్నా ఆయనకు నాటకాలతో అనుబంధం వల్లే జానపద కళల మీద ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా 'పగటి వేషాలు' అంటే చాలా ఇష్టం. పగటి వేషమంటే పగలు ధరించే మారురూపం. అర్జునుడు బృహన్నలగా, వేంకటేశ్వరుడు ఎరుకల సానిగా మారురూపాలు ధరించి ప్రశంసా పాత్రులు అయినారు. చదువురాని 'గొల్లబోయ'. 'వితంతువు' తదితర వేషాలు సామాజిక చైతన్యాన్ని రగిల్చాయి. ఆయన రంగస్థలం మీద "ఫలించని వంచన" నాటికలో కథానాయికగా, "ఏక్ దిన్ కా సుల్తాన్"లో మీసాల వెంకటరత్నంగా "మనుషు లొస్తున్నారు జాగ్రత్త"లో రెడ్డి గా, "క్రాంతి"లో రామారావుగా, "ది ఇన్సిడెంట్"లో బ్రాహ్మణుడుగా, "తాకట్టు"లో జ్ఞానేశ్‌గా, "కీర్తిశేషులు" నాటకంలో మురారిగా, ఆకాశవాణి, విజయవాడ కేంద్రంలో "రాంబాబు కాపరం"లో రాంబాబుగా, జాతీయ నాటకం నాదయోగిలో రామ రాయుడిగా , "అపూర్వ నరకం"లో తమిళ అయ్యరుగా, హైదరాబాద్ దూరదర్శన్‌లో "మొదటికే మోసం" బొమ్మలాటలో పప్పెట్‌గా, "సంసారం సాగరం" మెగా సీరియల్‌లో మంత్రగాడుగా, మినీ మూవీలో గంగిరెడ్డిగా, లయ సీరియల్‌లో వెంకటరావుగా, అబ్బాయి ప్రేమలో పడ్డాడు చలన చిత్రంలో గుండు అనుచరుడుగా నటించారు.ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి తొలి రంగుల సినిమా బొమ్మలాటనూ వివిధ భారతిలో ఇవ్వటం, పగటి వేషాలు, సామాజిక ప్రయోజనం అనే అంశం మీద మూడు వారాల ధారావాహిక ప్రసంగాలు, గుడివాడ నాటక రంగం మీద మూడు వారాల ప్రసంగాలు ఇచ్చారు.గుడివాడ పురపాలక సంఘ అడుసుమిల్లి ఉన్నత పాఠశాలలో చిత్రకళ ఉపాధ్యాయునిగా 1985 నుండి పనిచేసి, సాంకేతిక విద్యలు నేర్పిస్తూ విద్యార్థులను ఉత్సాహ పరుస్తూ నూతన దృక్పథాన్ని ప్రేరేపించారు. ఇందుకు ఆయన తన సొంత డబ్బును సమకూర్చి, స్క్రీన్ ప్రింటింగ్, ఫోటో లామినేషన్, పెయింటింగ్స్, పప్పెటరీ విద్యను బోధిస్తూ, ఒక కొత్త పద్ధతిలో బొమ్మలు వేయడం ద్వారా పిల్లలకు డబ్బు సంపాదించే మార్గాన్ని నేర్పించారు. పిల్లలతో బొమ్మలను తయారు చేసి, పప్పెట్ షోలను ఇప్పించడం స్వీయధనంతో తాతా రమేష్ బాబు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్జాతీయ సంస్థ ఆర్థిక సమతా మండలి, శ్రీకాకుళంలో .కొన్ని వందల మంది బాలబాలికలకు, అంగన్వాడి కార్యకర్తలకు, నమూనాలు తయారు చేయటం, స్క్రీన్ ప్రింటింగ్, మొదలయిన అనేక కళలలో సృజనాత్మక శిక్షణ ఇచ్చారు. అయిదు లక్షలకు పైగా అభినందన పత్రాలు, సూక్ష్మ చిత్రాలు, నీటి తైల వర్ణ చిత్రాలు చిత్రించారు. తాతా రమేశ్ బాబు వివిధ సీరియళ్లలో నటించారు.ఆడది, సంసారం-సాగరం, లయ, ఎదురీత, గంగతో రాంబాలు, అడవిపూలు, శ్రావణ సమీరాలు, మూగ మనసులు, అమ్మనా కోడలా, ప్రియమైన శత్రువు, అగ్నిపూలు, ఆకాశమంత, జాబిలమ్మ, రాములమ్మ, పాపం పద్మనాభం, ఇద్దరు అమ్మాయిలు, రాణివాసం, మనసు-మమత, అలక నంద, ఇది ఒక ప్రేమకథ, రియల్ డిటెక్టివ్స్, తాళికట్టు శుభవేళ, ఆడువారి మాటలకు అర్థాలు వేరులే తదితరాలతో నటించారు.ఆయన రాంబాబు కాపురం, నాదయోగి (జాతీయ నాటకం), అపూర్వ నరకం, కూటి విద్య, యశోధర, వసతిగృహం తదితర ఆలిండియా రేడియో - విజయ వాడ స్టేషను నుండి నాటకాల్లో పాల్గొన్నారు.ఆకాశవాణి, దూరదర్శన్, ఇతర టీవీ కార్యక్రమాల్లో నటుడిగా, ప్రయోక్తగా, వక్తగా పాల్గొన్న బహుముఖీన ప్రతిభా విశేషాల్ని కలిగిన రమేశ్ బాబు అనేక సత్కారాలు, సన్మానాలూ పొందారు. చిత్రకళా సంసద్ రాష్ట్ర ఉత్తమ చిత్ర పురస్కారం, యునెస్కో క్లబ్ వారి అంతర్జాతీయ సాంస్కృతిక పురస్కారం,తిలక్ విశిష్ట సాహితీ పురస్కారం, శేషేంద్రశర్మ పురస్కారం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, ఆం.ప్ర సాంస్కృతిక మండలి కృజి పురస్కారం, ఆం.ప్ర అధికార భాషా సంఘం భాషా సేవా పురస్కారం, జానపద కళామిత్ర పురస్కారం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం, విశ్వకళా మహోత్సవ పురస్కారం, తదితరాలు కాక, ఆయనకు 2015 ఉగాది పురస్కారం చిత్రలేఖనం విభాగంలో లభించింది. తాతా రమేశ్ బాబు గుడివాడలోని తన స్వగృహంలో 2017, ఏప్రిల్ 20 న మరణించారు.

# తెలుగు చిత్రసీమలో ప్రథమ నేపథ్య గాయకుడు



"శ్రీ హనుమాన్ గురుదేవులు నా యెద పలికిన సీతా రామ కథ....నే పలికెద సీతా రామ కథ"... ఎమ్మెస్ రామారావు సుమధుర కంఠం నుండి జాలువారిన సుందరాకాండ వినని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. హనుమాన్ జయంతి, శ్రీ రామ నవమి నేపథ్యం లో, హనుమాన్ మండల దీక్షలు, రామ నవరాత్రుల సందర్భంగా ఎక్కడ విన్నా సుందరాకాండ వినిపించడం సర్వ సాధారణమే. అంతేకాక, ఆంజనేయ, రామాల యాలలో నిరంతరం మైకుల ద్వారా రామారావు గానం చేసిన సుందరా కాండ ప్రతిధ్వనించడం కద్దు. మోపర్తి సీతారామారావు అంటే ఎవరో చాలామందికి వెంటనే స్ఫురించక పోవచ్చును. కాని ఎం.ఎస్.రామారావు అనగానే తెలుగు సినిమాల తొలి నేపథ్య గాయకునిగా సంగీతాభిమానులకు, పాత తరం సినీ ప్రేక్షకులకూ ఆయన గుర్తుంటారు. సుందరదాసు' అన గానే ఆయన యావత్ తెలుగు ప్రజలందరికీ సుపరిచితులు, సుప్రసిద్ధులు. ఆయన రచించి, సంగీతం సమకూర్చి గానం చేసిన 'సుందరకాండ' గీతాలు యావ దాంధ్ర దేశంలోనూ మారు మ్రోగాయి. మారు మ్రోగుతు న్నాయి. ఇంకా మారు మ్రోగుతూనే ఉంటాయి. రామాయణంలోని మధురమైన 'సుందరకాండ' కథను, తేట తెలుగులో, మృదు మధుర మైన శైలిలో ఆయన పాడిన తీరు అసమానం, అపూర్వం, అద్వితీ యం. ఇలా మూడు విధాలుగా స్వీయ రచన గావించి, సంగీతం సమకూర్చి, స్వయంగా గానం చేసిన అసమాన ప్రతిభాశాలి ఎమ్మెస్ రామారావుకు ముందు మరొక లేరనడం అతిశయోక్తి కాదు. ఆయనకు "సుందర దాసు" అనే బిరుదు ఉంది. గేయ రూపంలో రచించి గానం చేసిన రామయణ భాగం సుందరకాండము "ఎమ్మెస్ రామారావు సుందరకాండ" గా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఆ రెండూ ఆయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చిపెట్టాయి.ఎమ్మెస్ రామారావు (మోపర్తి సీతారామారావు) 1921 మార్చి 7న గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మోపర్రు గ్రామలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు మోపర్తి రంగయ్య, మంగమ్మ గార్లు సీతారామ భక్తులు. చిన్నతనం నుండే రామారావు గారు పాటలు పాడుతుండేవారు. ఆయన విద్యాభ్యాసము నిడుబ్రోలు ఉన్నత పాఠశాలలో, గుంటూరు హిందూ కళాశాలలో జరిగింది. ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో (1941 లో) అంతర్ కళాశాలల లలిత సంగీత పోటీలో మొదటి బహుమతి గెలుచు కున్నారు. న్యాయనిర్ణేతల్లో ఒకరైన అడవి బాపిరాజు చలన చిత్ర రంగంలో ప్రవేశించమని ఆయనను చాలా ప్రోత్సహించారు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా "ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా" అనే ఎంకి పాట పాడిం చారు. ఆ చిత్రంలో కథా నాయకుని పాత్ర పోషించిన సి.హెచ్. నారాయణరావుకు పాడారు. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్య గానం. అలా తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి నేపథ్య గాయకు లుగా గుర్తింపు పొందారు. తరువాత ఎమ్మెస్ దీక్ష, ద్రోహి, మొదటిరాత్రి, పాండురంగ మహాత్యం, నా యిల్లు, సీతారామ కల్యాణము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన సినిమాలలో పాడారు. 1944 నుంచి 64 వరకు తెలుగు చలన చిత్రాలలో నేపథ్య గాయకునిగా మద్రాసులో నివసిం చిన ఆయన 5 సంవత్సరాల పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చు కున్నారు. కొన్ని పాటలు రాసి నల్లపిల్ల, తాజ్ మహల్, హంపి, కనీసం, హిమాలయాలకు రాలేనయ్యా, మొదలైన గ్రామఫోన్ రికార్డులు ఇచ్చారు. నీరాజనం చిత్రంలో "ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధములో నిదురించు జహాపనా" పాటలో ఎమ్మెస్ గొంతు వినిపించింది. 1963 సంవత్సరాంతంలో మద్రాసు వదిలి వెళ్లి, రాజమండ్రి చేరుకుని 1974వరకు అక్కడే నివసించారు. అక్కడ నవభారతి గురుకులంలో పది సంవత్సరాలు ఉద్యోగం చేసా రు. 1970 లో పెద్ద కుమారుడు బాబూరావు భారతీయ వాయుసేన ఇండియన్ ఏర్ ఫోర్స్ లో పైలట్ ఆఫీసరుగా నియమితుడైనారు. 1971లో పాకిస్థానుతో జరిగిన యుద్ధ కాలంలో అతని ఆచూకీ తెలియ లేదు. తల్లి తండ్రులిద్దరూ భయం చెంది కుమారుని క్షేమం కోసం వాయు కుమారుడైన హను మంతుని ఆరాధించడం మొదలు పెట్టారు. తర్వాత కొంత కాలానికి అబ్బాయి క్షేమంగా ఇల్లు చేరడంతో శ్రీ హనుమానుడే వారి ఇష్ట దైవమై నాడు. ఆయన హనుమాన్ చాలీసా, సుందరకాండ వ్రాయ డానికి అదే ప్రేరణ. 1972 నుండి 74 వరకు తులసీదాసు హనుమాన్ చాలీసాను హిందీ నుంచి తెలుగు లోనికి అనువదించారు, తన పేరుతో అవినాభావ సంబంధ మేర్పడ్డ సుందరకాండ గేయ రచన చేశాడు. 1975 నుంచి హైదరా బాదులోని చిక్కడపల్లిలో నివసించారు. రామారావుకు 1977 సంవత్సరంలో సుందరదాసు అనే బిరుదాన్ని ఇచ్చారు. ఈయన ఏప్రిల్ 20, 1992న హైదరా బాదులో తుది శ్వాస విడిచారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# పెళ్లిపై నాకు నమ్మకం లేదు... నటి త్రిష సెన్సేషనల్ కామెంట్స్!

**వివాహ వ్యవస్థపై తనకు నమ్మకం లేదన్న త్రిష**
**పెళ్లి అయినా, కాకపోయినా తనకు ఫరవాలేదని తేల్చి చెప్పిన వైనం**
**ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పెళ్లిపై సెన్సేషనల్ కామెంట్స్**

కోలీవుడ్ సీనియర్ నటి త్రిష క్రిష్ణన్ పెళ్లి అయినా, కాకపోయినా తనకు ఫరవాలేదని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో వివాహ వ్యవస్థపై తనకు నమ్మకం లేదని ఆమె సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. కమల్ హాసన్‌తో కలిసి త్రిష నటించిన తాజా చిత్రం థగ్ లైఫ్. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న త్రిషకు పెళ్లిపై ప్రశ్న ఎదురైంది. దానికి ఆమె ఇలా షాకింగ్ సమాధానం చెప్పారు. మొత్తంగా తనకు పెళ్లిపై సదుద్దేశం లేదని త్రిష స్పష్టం చేశారు. ఇక ఆమె సమాధానం విని పక్కనే ఉన్న కమల్ కూడా షాకయ్యారు. ఇదిలా ఉంటే... గత కొంతకాలంగా త్రిష పెళ్లిపై వదంతలు వ్యాప్తి చెందుతోన్న విషయం తెలిసిందే. ఆమె ప్రేమలో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. ఆ పుకార్లను ఆమె తీవ్రంగా ఖండించారు. తన పెళ్లి ఎప్పుడు అవుతుందో తనకే తెలియదన్నారు. కానీ, తన మనసుకు నచ్చిన వ్యక్తి దొరికేతే కచ్చితంగా పెళ్లి చేసుకుంటానని తెలిపారు. అలాగే తనను పెళ్లిచేసుకోబోయేవాడు జీవితాంతం తనతో కలిసి ఉంటాడనే నమ్మకల కలగాలని చెప్పారు. అప్పుడే పెళ్లి చేసుకుంటానన్నారు. పెళ్లిచేసుకుని మధ్యలోనే విడాకులు తీసుకుని విడిపోవడం తనకు ఇష్టం లేదన్నారు. వివాహం చేసుకుని చాలామంది అసంతృప్తిగా జీవిస్తున్నారని, అలాంటి పరిస్థితి తనకు ఎదురుకాకూడదని త్రిష స్పష్టం చేశారు. ఇక, త్రిష ప్రస్తుతం థగ్ లైఫ్‌తో పాటు తెలుగులో మెగాస్టార్ చిరంజీవి సరసన విశ్వంభర సినిమాలోనూ నటిస్తున్న విషయం తెలిసిందే. స్టాలిన్ తర్వాత చిరు, త్రిష కాంబోలో వస్తున్న చిత్రమిది.





# చెన్నైలో నటుడు బాబీ సింహా కారు బీభత్సం

**ఎక్కడుతంగల్-చెన్నై విమానాశ్రయం రోడ్డులో వాహనాలపైకి దూసుకెళ్లిన కారు**
**పలువురికి గాయాలు.. ఆరు వాహనాలు ధ్వంసం**
**డ్రైవర్ మద్యం మత్తులో కారు నడపడం వల్లే ప్రమాదమన్న పోలీసులు**

**ఘటన సమయంలో బాబీ సింహా కారులో లేరని పోలీసుల వెల్లడి**

తమిళ నటుడు బాబీ సింహా కారు ఈరోజు ఉదయం ఎక్కడుతంగల్–చెన్నై విమానాశ్రయం రోడ్డులో బీభత్సం సృష్టించింది. కారు ఇతర వాహనాలపైకి దూసుకెళ్లడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఆరు వాహనాలు ధ్వంసం అయ్యాయి. కారు డ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడమే ప్రమాదానికి కారణమని పోలీసులు వెల్లడించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ఘటన జరిగిన సమయంలో నటుడు బాబీ సింహా కారులో లేరని పోలీసులు వెల్లడించారు.

# నటుడు రాజ్ తరుణ్, శేఖర్ బాషాలపై లావణ్య సంచలన ఆరోపణలు

**నటుడు రాజ్ తరుణ్, అతని స్నేహితుడు శేఖర్ బాషా తనని హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపణలు చేసిన లావణ్య**
**నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసిన లావణ్య**
**తన ఫిర్యాదుపై పోలీసులు వెంటనే స్పందించలేదంటూ లావణ్య ఆరోపణలు**

నటుడు రాజ్ తరుణ్, అతని స్నేహితుడు శేఖర్ బాషా తనను హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నారని లావణ్య సంచలన ఆరోపణలు చేశారు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆమె నార్సింగ్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆరోపణలు చేశారు. తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కేసు ప్రస్తుతం కోర్టులో ఉండగా, ఇటీవల కొందరు తనపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. శుక్రవారం సాయంత్రం కూడా నలుగురు మహిళలు ఇంట్లోకి వచ్చేందుకు ప్రయత్నించారన్నారు. దీనిపై తాను శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రతి నిమిషం ప్రాణభయంతో బతుకుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రాణం పోయిన తర్వాత వారిని పట్టుకుంటారా అని ఆమె ప్రశ్నించారు.



# విజయనగరం జిల్లా పోలీస్ స్టేషన్‌లో శ్రీరెడ్డి

**చంద్రబాబు, పవన్, లోకేశ్ లపై దారుణ వ్యాఖ్యలు చేసిన శ్రీరెడ్డి**
**శ్రీరెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు**
**పూసపాటిరేగ పోలీస్ స్టేషన్ కు వచ్చిన శ్రీరెడ్డి**

నటి శ్రీరెడ్డిని విజయనగరం జిల్లా పూసపాటిరేగ పోలీసులు విచారిస్తున్నారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లపై దారుణమైన వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన శ్రీరెడ్డి ఈరోజు పోలీస్ స్టేషన్ లో విచారణకు హాజరయింది. విచారణకు హాజరు కావాలంటూ పోలీసులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆమె పోలీస్ స్టేషన్ కు వచ్చింది. పీఎస్ కు వచ్చిన ఆమెను పోలీసులు విచారిస్తున్నారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో శ్రీరెడ్డి అడ్డూఅదుపు లేకుండా చెలరేగిపోయింది. మహిళ అనే విచక్షణ కూడా లేకుండా సోషల్ మీడియా వేదికగా బండ బూతులు మాట్లాడింది. అయితే ఎన్నికల్లో కూటమి గెలిచిన వెంటనే ఆమె స్వరం మార్చింది. తనను క్షమించాలని, ఇకపై రాజకీయాల గురించి మాట్లాడనని ఆమె వేడుకుంది. 'నారా లోకేశ్ అన్నయ్యా క్షమించండి' అంటూ బహిరంగంగా క్షమాపణలు కూడా చెప్పింది. అయితే ఆమెపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న కూటమి కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆమెపై కేసు నమోదు చేసిన పోలీసులు... విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. దీంతో ఆమె విచారణకు హాజరయ్యారు.

